

శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 9.01.868
బంగారం : 48 గ్రాముల 300 మిల్లీ గ్రాములు
వెండి : 63 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



గంజాయి స్వాధీనం

రాయగడలో 23 కిలోల గంజాయి దొరికింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

- 10లో



నకిలీ విదేశీ మద్యం

గుణుపూర్ సబ్ డివిజన్‌లో నకిలీ విదేశీ మద్యం దొరికింది. పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- 10లో

న్యూస్‌రీల్

నేటి నుంచి రాజభవన్ సందర్శనకు అనుమతి



భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్ ఉద్యానం సందర్శనకు సాధారణ ప్రజానీకానికి ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకు అధికారులు అనుమతి ఇచ్చారు. సువిశాలమైన రాజ్‌భవన్‌ను విస్తరించిన నేపథ్యంలో సందర్శనకు ఇదో మంచి అవకాశం. - భువనేశ్వర్

పతిత పావనుని కుడ్య గోపురానికి వెండి తాపడం



పూరీ శ్రీ జగన్నాథ దేవస్థానం సింహ ద్వారం ప్రాంగణంలో నిత్య పూజలు అందుకుంటున్న పతిత పావనుడు కుడ్య ప్రతిమ గోపురం సరికొత్త కళతో తళతళలాడుతుంది. సింహ ద్వారం ఆవరణ వెండి తాపడం పనుల్లో భాగంగా పతిత పావనునికి కొత్త రూపు దిద్దారు. - భువనేశ్వర్

కలిమెలలో మావోల డంప్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న డంప్‌లోని సామగ్రిని ప్రదర్శించిన దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు పోలీసుస్టేషన్ పరిధిలోని జినేల్‌గూఢ అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం మావోయిస్టుకు చెందిన డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కూంబింగ్ ముగించుకొని తిరిగి వస్తున్న సమయంలో డీఆర్‌జీ జవాన్లకు డంప్ తారసపడింది. డంప్‌ను స్వాధీనం చేసుకున్న జవాన్లు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రవేశపెట్టారు. యం.వి.79 పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్తాన్‌పల్లి, మేటగూఢ గ్రామ ప్రాంతాల మీదుగా జవాన్లు మోటు ప్రాంతాంలో జినాల్‌గూఢ అడవిలో కూంబింగ్‌కు శనివారం రాత్రి వెళ్లారు. ఆదివారం ఉదయం తిరిగి వస్తున్న డీఆర్‌జీ జవాన్లు డంప్‌ను గుర్తించి వెలికితీసి అందులో ఉన్న ఎస్ఎల్ఆర్ రైఫిల్, ఎస్ఎల్ఆర్ బుల్లెట్లు, 50 చిన్న ఎస్ఎల్ఆర్ బుల్లెట్లు, నాలుగు చార్జర్లు, మావోయిస్టు యూనిఫారాలు, మావో సాహిత్యం, టార్చ్‌లైట్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకొని జిల్లా ఎస్పీ వివేకానంద ఎదుట.. విలేకరుల సమక్షంలో ప్రవేశపెటారు. సెర్చ్ ఆపరేషన్లో పాల్గొన్న జవాన్లను అభినందిచారు.

ఉత్సాహంగా పథోత్సవం



పథోత్సవంలో గగుర్పొడిచిన కంభ విన్యాస భంగిమలు



ఉర్రూతలూగించిన అసీమా పండా, సత్యజిత్ ప్రధాన్ యుగళ గీతాలాపన



జయదేవ్ డ్యాన్స్ గ్రూప్ సంబల్‌పురి నృత్య ప్రదర్శన



పథోత్సవంలో మంత్రి డాక్టర్ కృష్ణ చంద్ర మహాపాత్రో

భువనేశ్వర్:

ఈ సీజన్ రెండో పథోత్సవం ఆబాలగోపాలాన్ని ఉత్సాహపరిచింది. భువనేశ్వర్ నగర పాలక సంస్థ బీఎంసీ సౌత్ వెస్ట్ జోన్ జొగామొరా ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన పథోత్సవంలో సనాతన కళలు, సంస్కృతిని ప్రతిబింబించే పలు కనువిందు చేసే విన్యాసాలు నగర వాసుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. సహజమైన సంరక్షణతో ఆరోగ్యం, శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం ప్రేరిత అంగ విన్యాసాలు, సంగీత, నృత్య ప్రదర్శనలు, బాలల్లో చురుకుదనం పదును పెట్టే పలు సృజనాత్మక కార్యక్రమాలు అన్ని వర్గాల ప్రజల్ని ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర గృహ నిర్మాణం, నగర అభివృద్ధి, ప్రభుత్వ రంగ సంస్థల విభాగం మంత్రి డాక్టర్ కృష్ణ చంద్ర మహాపాత్రో, స్థానిక ఏకామ్ర ఎమ్మెల్యే బాబు సింగ్, నగర మేయర్ సులోచన దాస్, డిప్యూటీ మేయర్ మంజులతా కన్హర్, గృహ నిర్మాణం, నగర అభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ ఉషా పాఢి, భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాజేష్ ప్రభాకర్ పాటిల్, సలహా కమిటీ అధ్యక్షులు, కార్పొరేటర్లు ఇతర ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు.

పథోత్సవం సమాజ భాగస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని మంత్రి డాక్టర్ కృష్ణ చంద్ర మహాపాత్రో తెలిపారు. ప్రధాన వేదిక ప్రఖ్యాత కళాకారుల ప్రతిభ ప్రదర్శనలతో అందరిలో ఉత్సాహం ఊపందుకుందన్నారు. యుగళ గాయకులు అసీమా పండా, సత్యజిత్ ప్రధాన్ తమ మధురమైన మనోజ్ఞతను ప్రదర్శించగా, రాపర్ బిగ్ డీల్ డైనమిక్ బీట్‌లతో ప్రేక్షకులను ఉత్తేజపరిచారు. ఉత్సాహాన్ని జోడిస్తూ, జయదేవ్ డ్యాన్స్ గ్రూప్ నృత్య విన్యాసాల పథోత్సవానికి మరింత తేజస్సుని రంగరించాయి.



పథోత్సవం సృజనాత్మక పోటీల్లో బాలలు

ఇంద్రావతి-భువనేశ్వర్, భవానీ పట్నా-అయోధ్య బస్సులు ప్రారంభం



ఇంద్రావతి-భువనేశ్వర్ బస్సు ప్రారంభిస్తున్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

కొరాపుట్: సుదీర్ఘ ప్రయాణాలు చేసే వారికి ఓఎస్ఆర్‌టీసీ నూతన బస్సుల సర్వీసులు ప్రారంభించింది. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా ఇంద్రావతి నుంచి భువనేశ్వర్‌కి బస్సు ప్రారంభించింది. ఈ బస్సు ప్రతి రోజు రాత్రి 10.30 కి ఇంద్రావతి నుంచి బయల్దేరి నబరంగ్‌పూర్, పపడాహండి, భవానీ పట్న మీదుగా భువనేశ్వర్ చేరుతుంది. అదే విధంగా తిరుగు ప్రయాణం చేస్తుంది. నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి జెండా ఊపి ఈ బస్సు ప్రారంభించారు. మరో వైపు పక్కనే ఉన్న కలహండి జిల్లా భవానీ పట్న నుంచి కుంభ మేళా కోసం ప్రత్యేక బస్సు ప్రారంభించారు. ఈ బస్సు ఆదివారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ సర్వీసుని మహా శివరాత్రి వరకు నడపనున్నారు. భవాని పట్న నుంచి అయోధ్య, వారణాశి, ప్రయాగ్ రాజ్‌లకు ఈ సర్వీసు ఉంది. ఒక వైపు టిక్కెట్ ధర రు.2,449 గా నిర్ణయించారు. ఈ రెండు సర్వీసులు ఓల్వో బస్సులు కావడం గమనార్హం.

ఆదివాసీ రాణి.. జ్యోతి



ఆదివాసీ రాణి కిరీటం సాధించిన జ్యోతి

జయపురం: భువనేశ్వర్‌లో రమాదేవి విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ట్రైబల్ గ్లోబల్ ఫెస్ట్‌లో కొరాపుట్ జిల్లా గిరిజన మహిళ జ్యోతి పూజారి ప్రతిభ చాటింది. ఒడిశా ఆదివాసీ రాణి పోటీల్లో అవిభక్త కొరాపుట్ జిల్లా నుంచి 10 మందితో పాటు 25 మంది ఆదివాసీ మహిళలు పాల్గొన్నారు. వారిలో జయపురం సబ్ డివిజన్ ఆదివాసీ మహిళ జ్యోతి పూజారి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర ఆదివాసీ రాణి కిరీటం సాధించింది. జ్యోతి పూజారి తన చిన్నతనంలోనే తల్లి దండ్రులను కోల్పోయింది. జయపురం పారాబెడలో గల తన పిన్ని ఇంటిలో ఉంటూ +2 చదువుతోంది. 2016లో జ్యోతి మెట్రిక్‌లో ఉత్తీర్ణురాలు అయినా కుటుంబ పరిస్థితుల కారణంగా ఉన్నత చదువులకు వెళ్లలేకపోయింది. దీంతో పాటలు పాడుతూ డ్యాన్స్‌లు చేస్తూ వచ్చిన డబ్బుతో తన పిన్ని కుటుంబానికి చేదోడువాదోడుగా నిలిచింది. ఇదే పోటీలో మల్కన్‌గిరి జిల్లా ఖొయిర్‌పుట్ బోండా యువతి బొడొనాయిక్ రన్నర్‌గా నిలిచింది. అలాగే ఆదివాసీ అలంకరణలో మల్కనగిరి జిల్లా ధరమపల్లి కోయ ఆదివాసీ సంప్రదాయ యువతి సొనాలి పాడియామి గెలుపొందింది. కొరాపుట్ జిల్లా జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి నువాగుడ గ్రామం హీరా హరిజన్ ఆభరణాల అలంకరణలో రెండో స్థానం సాధించింది.



మమతా బెహరతో దివాస రాణి జ్యోతి పూజారి, అలంకరణలో ప్రథమ స్థానం పొందిన సొనాలి పాడియామిలు



ట్రైబల్ గ్లోబల్ ఫెస్ట్‌లో అవిభక కొరాపుట్ విజేతలైన ఆదివాసీ మహిళలు

మహా కుంభమేళాకు ప్రత్యక్ష బస్సు సేవలు



సంప్రదాయబద్ధంగా బయల్దేరిన కుంభ మేళా బస్సు



లోక్ సేవా భవన్ నుంచి జెండా ఊపి మహా కుంభ మేళా ప్రత్యక్ష బస్సు సేవల్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



పూరీ, బరంపురం, సంబల్‌పూర్, భవానీపట్న ప్రాంతాల నుంచి వర్చువల్‌గా బస్సు సేవలు ప్రారంభించిన ముఖ్యమంత్రి

భువనేశ్వర్: రాష్ట్రం నుంచి మహా కుంభమేళాకు ప్రత్యక్ష బస్సు సేవలు సౌకర్యం కల్పించారు. రాష్ట్రంలో 4 ప్రధాన నగరాల నుంచి ఉత్తర ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళా ప్రాంతానికి ఈ బస్సు సేవల్ని ప్రారంభించారు. స్థానిక లోక్ సేవా భవన్ నుంచి ఆదివారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. ఒడిశా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఓఎస్ఆర్‌టీసీ) ఈ బస్సు సేవల్ని నిర్వహిస్తుంది. పూరీ, సంబల్‌పూర్, భవానీపట్న, బరంపురం నుంచి మహా కుంభ మేళాకు ప్రత్యక్ష బస్సు ప్రయాణ సౌకర్యం ఆదివారం నుంచి అందుబాటులోకి వచ్చింది. మహా కుంభమేళాకు ప్రత్యక్ష బస్సు ప్రయాణ సౌకర్యం ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి నెల 26 వరకు నిరవధికంగా కొనసాగుతుంది. మహిళా ప్రయాణికులకు బస్సు టిక్కెట్లపై 50 శాతం రాయితీ కల్పించారు.

ఈ బస్సులు పూరీ, సంబలపూర్, భవానీపట్న, బరంపురం ప్రాంతాల నుంచి బయల్దేరి వారణాసి, ప్రయాగ్‌రాజ్ మీదుగా అయోధ్య వరకు పయనమవుతాయి. ఈ ప్రయత్నం ఫలప్రదం అయితే అయోధ్య, వారణాసి, మధుర (బృందావనం), శ్రీ మహా కాళేశ్వర దేవాలయం, తిరుపతితో సహా దేశంలోని ప్రముఖ తీర్థయాత్ర కేంద్రాలకు ఒడియా భక్తులకు ప్రత్యక్ష బస్సు ప్రయాణం సౌకర్యం ప్రవేశ పెట్టేందుకు రాష్ట్ర రవాణా విభాగం యోచిస్తోంది.

250 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

జయపురం: జయపురం హటపాదర్ ప్రాంతంలో ఆయుస్మాన్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మంది రోగులకు వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు. డాక్టర్ సురేష్ పాణిగ్రాహి, డాక్టర్ సిద్ధాంత నాయిక్, డాక్టర్ శుభం మహాపాత్రోలు రోగులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో అంటు వ్యాధులు, వైరల్ ఫీవర్, మలేరియా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

15 ఎకరాల్లో గంజాయి సాగు ధ్వంసం



గంజాయి మొక్కలకు నిప్పుపెడుతున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని గుడారిలో గంజాయి సాగవుతున్న ప్రాంతాన్ని డ్రోన్ ద్వారా జిల్లా పోలీసులు గుర్తించారు. దీంతో ఆదివారం గుడారి పరిధిలోని కటిలి అటవీ ప్రాంతంలో దాడులను నిర్వహించి 15 ఎకరాల విస్తీర్ణంలా సాగవుతున్న 45 వేల గంజాయి మొక్కలను సిబ్బంది ధ్వంసం చేసిన అనంతరం వాటిని తగుల బెట్టారు. కొద్ది నెలలుగా జిల్లా పోలీస్ యంత్రాంగం గంజాయి అక్రమ రవాణా, సాగుపై ఉక్కుపాదం మోపింది.

24న కలెక్టరేట్ ముట్టడి



సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు జయంతి దాస్ తదితరులు

• జీవికా మిషన్ ఈసీ సంఘం నిర్ణయం

జయపురం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని జీవికా మిషన్ ఈసీ సంఘం ప్రతినిధులు కోరారు. లేని పక్షంలో ఈ నెల 24వ తేదీన కొరాపుట్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించాలని నిర్ణయించారు. స్థానిక కార్మిక భవనంలో అఖిల ఒడిశా జీవికా మిషన్ ఈసీ సంఘం కొరాపుట్ జిల్లా శాఖ అత్యవసర సమావేశాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షురాలు జ్యోతీరేఖ భట్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ఒడిశా రాష్ట్ర కార్యదర్శి, అఖిల ఒడిశా జీవికా మిషన్ ఈసీ సంఘ అధ్యక్షుడు జయంతి దాస్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 70 లక్షల మిషన్ శక్తి మహిళా సభ్యుల్లో ఒక లక్ష 35 వేల మందిని ఈసీ సభ్యులుగా గత ప్రభుత్వం వేరు చేసిందన్నారు. వారికి నేటి వరకు ఉద్యోగులుగా గుర్తింపు లభించలేదని వెల్లడించారు. మిశన్ శక్తి ఆధీనంలో పనిచేస్తున్న ఈసీలకు ట్రావెలింగ్ కోసం గతంలో రూ. 1500 ఇస్తుండేదని.. అయితే గత సెప్టెంబర్ నుంచి నిలిపి వేసిందన్నారు. ఈసీ రిజిస్ట్రేషన్ (పునర్ఘటన) పేరుతో తమ పార్టీ వారిని నియమించే అభిప్రాయంతో బీజేపీ ప్రభుత్వం పథకం వేస్తోందని ఆరోపించారు. అందుకు రహస్య పథకం రూపొందిస్తుందన్నారు. సామాజిక సురక్షా పథకంలో ఈపీఎఫ, ఈఎస్ఆర్ తదితర కనీస సైకర్యాలు కల్పించలేదని దుయ్యబట్టారు. జీవిక మిషన్ ఈసీలకు ఈపీఎఫ్, ఈఎస్ఆర్ సౌకర్యం కల్పించాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ వయసు 65 ఏళ్లకు పెంచాలనే డిమాండ్లతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. అలాగే అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన వంటవారిని, వారి సహాయకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని దాస్ వెల్లడించారు. సమావేశంలో పూర్ణిమా రౌత్, సబితా జాని, బిమళ భొత్ర, ధనిత్రి గొలారి, చంచల హరిజన్, మాధురి బిడిక పాల్గొన్నారు.



హాజరైన ఈసీ మహిళలు

వంశధార వసంతోత్సవాలు ప్రారంభం



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, ప్రముఖులు



క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొమాంగొ



కబడ్డీ పోటీలు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 4 వ తేదీ వరకు జరగనున్న వంశధార వసంతోత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి మెగా క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. సేవాసమాజ్ సమీపంలో గల మైదానంలో గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 13 ఏళ్లగా వంశధార వసంతోత్సవాలను నిర్వహిస్తుండడం ఆనందదాయకమన్నారు. అంతకు ముందు గుణుపూర్ మా మంగళ మందిరం నుంచి క్రీడా మైదాన వేదిక వరకు భారీ ర్యాలీ జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర రైతా, మున్సిపాలిటీ చైర్మన్ మమత గౌడొ, వైస్ చైర్మన్ శివ ప్రసాద్ గౌడొ, జీఐఈటీ ఉపాధ్యక్షులు డాక్టర్ చంద్ర ధ్వజ పండ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోడి పందాలపై దాడులు

రణస్థలం: మండలంలోని చిల్లపేట రాజం గ్రామ సమీపంలోని తోటల్లో కోడిపందెం శిబిరంపై జె.ఆర్.పురం పోలీసులు దాడి చేసినట్లు ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.32,835, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఐదు కోళ్లు, ఎనిమిది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నరసన్నపేట: మండలం బాలసీమ-బసివలస మధ్య కాలువ గట్లపై ఆదివారం నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రాగా స్థానిక ఎస్‌ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వెళ్లి పందాలను అడ్డుకున్నారు. 12 మందిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.14580, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గార: మండలంలోని కూర్మనాథపురం సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.15,450, శ్రీకూర్మం గ్రామ పరిసరాల్లో పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.3150 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామని ఎస్‌ఐ ఆర్.జనార్దన తెలిపారు. కూర్మనాధపురం ఏరియాలో దొరికిన పేకాటరాయుళ్ల వద్ద నుంచి రెండు బైక్‌లు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, శనివారం బలరాంపురం పరిసరాల్లో దొరికిన వ్యక్తులే మరలా ఆదివారం కూడా ఉండటం, వీరిలో రూరల్ మండలం ఇప్పిలికి చెందిన టీడీపీ వ్యక్తులు కొందరు ఉండటంతో, వారిని తప్పించేందుకు గార పోలీసులపై సర్కిల్ వర్గాల నుంచి ఒత్తిడి వచ్చినట్టు తెలుస్తోంది.

కొత్తూరు: మండలంలోని మెట్టూరు సమీప తోటల్లో పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ ఆదివారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.2530 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



గార: మానసిక సంఘర్షణతో ఇబ్బందులు పడుతున్న ఓ వ్యక్తి మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గార పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సతివాడ గ్రామానికి చింతల రమణమూర్తి (58) ఈ నెల 10న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ ఉప్పరవీధికి చెందిన రవ్వ కృష్ణారావు ఆదివారం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై బి.లావణ్య తెలిపారు. అదే వీధిలో నివాసముంటున్న ఇద్దరు వ్యక్తులు కృష్ణారావుని ప్రతిరోజూ హేలన చేస్తుండటంతో ఈ ఘటనకు పాల్పడినట్లు చెప్పారు. 'నీకు బీపీ, సుగర్ ఉంది.. నువ్వు ఎందుకూ పనికిరావు అంటూ పదేపదే హేళన చేస్తుండటంతో మనస్థాపం చెందిన కృష్ణారావు అయ్యప్ప స్వామి గుడి కింద నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గ్రామస్తులు గమనించి వెంటనే పాతపట్నం సామాజిక ఆస్పత్రికి తరలించారు. శరీరం కాలిపోయి పరిస్థితి విషమంగా మారింది. బాధితుడు ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ అమీర్ ఆలీ

కొత్తూరు: మండలంలోని జన్నోడుగూడతో పాటు తివ్వకొండ ప్రాంతాల్లో ఉన్న పలు గిరిజన గ్రామాల సమీపంలో సారాబట్టీలపై దాడులు నిర్వహించారు. సీఐ చింతాడ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ తన సిబ్బందితో దాడులు చేపట్టి వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. వంద లీటర్ల సారా, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల విస్తృత ప్రచారం



ప్రచారంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ జనార్దన

గార/రణస్థలం: సంక్రాంతికి దూర ప్రాంతాలకు వెళ్లే వారంతా దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని గార ఎస్‌ఐ ఆర్.జనార్దన అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆటో ద్వారా మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పిక్కాట, పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన చర్యలు తప్పవని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి హెచ్చరించారు. ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు.

ఉత్సాహంగా భోగి పండుగ



హైటెక్ ప్లాజా వద్ద భోగిపండుగ వద్ద అభిమానులు, పార్టీ శ్రేణులు

పర్లాకిమిడి స్థానిక రాంనగర్ హైటెక్ ప్లాజా వద్ద భోగి పండుగను బీజేడీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి దంపతుల సమక్షంలో అర్చకులు వి.వి.రమణమూర్తి పూజలు చేసి భోగి మంట వెలిగించారు. కార్యక్రమంలో గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు, కాశీనగర్ సమితి చైర్మన్ బల్ల శాయమ్మ, పెద్ద కొత్తూరు పంచాయతీ బీజేడీ పార్టీ సభ్యులు పాల్గొన్నారు. – పర్లాకిమిడి



భోగిమంటలో పిడకలు వేస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి దంపతులు

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

పర్లాకిమిడి: స్వామి వివేకానంద యావత్ యువతకు దార్శనికుడని దేవీ మఠం మహాంత రామానంద దాస్ అన్నారు. స్థానిక రాజవీధిలోని ప్యాలస్‌లో యూటిక్ కంప్యూటర్స్ కార్యాలయంలో ఆదివారం వివేకానంద జయంతి ఉత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఉత్సవంలో గ్రాహక్ పంచాయతీ అధ్యక్షులు హరిమోహన్ పట్నాయిక్, ఏ.బి.వి.పి. రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షురాలు చేతన్ ప్రభ పాఢి, అఖిల భారత్ విద్యాపరిషద్ ఉపాధ్యక్షులు సమీర్ కుమార్ పాణిగ్రాహి, బిభూతీ భూషన్ రథ్, లోకనాథ్ పాఢి, పూర్ణకాళిన, సుభాష్ పాల్గొన్నారు.



వివేకానంద జయంతి ఉత్సవంలో మాట్లాడుతున్న మహాంత రామానంద్ దాస్

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయపడిన సారవకోట లక్ష్మి

సారవకోట: మండల కేంద్రం సారవకోటలో ఆదివారం కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకురావడంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి పర్లాకిమిడి మీదుగా శ్రీకాకుళం వెళ్తున్న కారు సారవకోట వచ్చే సరికి రోడ్డు పక్కనే మటన్ వ్యాపారం చేసుకుంటున్న వారి పైకి దూసుకొచ్చింది. మటన్ వ్యాపారి భార్య సారవకోట లక్ష్మిని ఢీకొని అక్కడి నుంచి కొంత దూరం వెళ్లి పారిశుధ్య కార్మికురాలు జయమ్మను ఢీకొట్టింది. కారుకు అడ్డంగా మటన్ కొట్టే దుక్క అడ్డుగా ఉండటంతో మరింత ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. మాంసం నేలపాలు కావడంతో సుమారు రూ.18 వేలు నష్టం వాటిల్లింది. గాయపడిన వారిని సారవకోట పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో నరసన్నపేట నుంచి శ్రీకాకుళం తీసుకెళ్లి చికిత్స అందించారు. ఆసుపత్రి వర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. కారు డ్రైవర్ నిద్రమత్తు వల్లే కారు అదుపు తప్పినట్లు సమాచారం.

కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలి

ఎచ్చెర్ల క్యాంపస్: పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని జనవిజ్ఞాన వేదిక, పర్యావరణ సబ్ కమిటీ ప్రతినిధులు కోరారు. ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల నుంచి విషపూరిత వాయువులు, జలకాలుష్యం నియంత్రించాలన్నారు. కాలుష్యం వల్ల సమీప గ్రామాల ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ర్యాలీలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు గిరిధర్, కామేశ్వరరావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విదేశీ మద్యం స్వాధీనం

- ముగ్గురి అరెస్టు



పట్టుబడిన మద్యం బాటిళ్ల బాక్సులు



పట్టుబడిన నిందితులు



నకిలీ విదేశీ మద్యం బాటిళ్లు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న గుమడలో ఐఎంఎఫ్ఎల్ విదేశీ మద్యం దుకాణానికి సమీపంలో ఒక అద్దె ఇంట్లో అబ్కారీ శాఖ మొబైల్ యూనిట్ శనివారం అర్ధరాత్రి ఆకస్మిక దాడులను నిర్వహించింది. దాడుల్లో వివిధ బ్రాండ్‌ల 137 కార్టుల్లో ఉన్న సుమారు 1242 లీటర్ల నకిలీ విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకొని ముగ్గురుని అరెస్టు చేశారు. కొంతమంది నకిలీ మద్యం తయారు చేసి వాటిని బాటిళ్లలో నింపి విదేశీ మద్యం బ్రాండ్ల స్టిక్కర్లు అతికించి ప్రభుత్వం మంజూరు చేసే విదేశీ మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ఈ విషయమై వచ్చిన సమాచారం మేరకు అబ్కారీ మొబైల్ యూనిట్ విభాగాధికారులు దాడులను నిర్వహించారు. వివిధ రకాల బ్రాండ్లతో ఉన్న స్టిక్కర్లు, బాటిల్ కప్పులను స్వాధీనం చేసుకున్నారు. బరంపురం నుంచి నకిలీ మద్యాన్ని తీసుకొచ్చి ఖాళీ బాటిళ్లలో మద్యాన్ని నింపి స్టిక్కర్లను అతికించి విక్రయిస్తున్నట్లు దార్యప్తులో తేలిందని అధికారులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. నిందితుల వివరాలను అధికారులు తెలియజేయలేదు.

అమ్మవారి ఆలయం ఎదుట క్యూలైన్లు



రారండోయ్ జాతర చూద్దాం

- రేపటి నుంచి కోటపాలెం భద్రమహంకాళీ అమ్మవారి జాతర
- రెండు రోజుల పాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

రణస్థలం:

ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతిగాంచిన రణస్థలం మండలం కోటపాలెం శేరిలో కొలువైన భద్రమహంకాళి అమ్మవారి జాతర మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా సంక్రాంతి నాడు ప్రారంభమై ముక్కనుమతో ముగిసే ఈ జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. సంక్రాంతి ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. కనుమ నాడు భారీగా కోళ్లు, పాట్టేళ్లతో మొక్కులు తీర్చుకుంటారు. కొత్త వాహనాలు ప్రారంభించడం ఇక్కడ ప్రత్యేకత. మూడు రోజు పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా వెలుగుల మధ్య జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాం నుంచి ఈ జాతర నిర్వహణపై ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ వహించడంతో యాత్ర కనులపండువగా జరుగుతోంది.



ప్రత్యేక అలంకరణలో భద్రమహంకాళీ అమ్మవారు

కోర్కెలు తీర్చే కల్పవల్లి..

ఉత్తరాంధ్ర జిల్లాలోని శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో మత్స్యకారుల ఆరాధ్య దైవంగా, ఇతర వర్గాల భక్తులు కోరుకున్న కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భద్రమహంకాళీ అమ్మవారు ఖ్యాతి గాంచింది. మత్స్యకారులు దూర ప్రయాణాలు చేయలన్నా, సముద్రంలో మత్స్యవేటకు వెళ్లాలన్నా, ఇంట్లో ఏ పండుగ చేసుకోవాలన్నా భద్రమహంకాళి అమ్మవారిని దర్శించుకుని ఆశీశ్సులు తీసుకుని బయలుదేరుతారు. గొర్లె శ్రీరాములునాయుడు కుటుంబీలుఆలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్వహణ బాధ్యతలు చూస్తుంటారు. ఆచారం ప్రకారం అమ్మవారి విగ్రహంపై ఎటువంటి గోపురం లేకుండానే భక్తులకు దర్శనం ఇవ్వడం ఇక్కడి ప్రత్యేకత.

వైవిధ్యభరితంగా మొక్కుల చెల్లింపు..

పరిసర ప్రాంతాల భక్తులు కొత్త వాహనాలు కొంటే భద్రమహంకాళీ అమ్మవారి సన్నిధిలో పూజలు చేసి ప్రారంభించడం అనవాయితీ. గ్రామాల్లో వారాల పండుగ చేసుకోవాలన్నా, కనుమ, దసరా వంటి ప్రత్యేక పండుగ రోజుల్లో అమ్మవారికి కోళ్లు, మేకలు, పొట్టేళ్లను మొక్కులుగా చెల్లించుకుని అనంతరం పనులు మొదలు పెడతారు. కనుమ రోజు వేకువజాము నుంచే గ్రామంలో సందడి మొదలవుతుంది. ఆ ప్రాంతమంతా అత్యంత రద్దీగా ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా భద్రమహంకాళి అమ్మవారి కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాల అలంకరణలు, బాణసంచా వెలుగులతో అమ్మవారి జాతర కనువిందు చేస్తుంది.

అన్ని సౌకర్యాలు కల్పించాం..



భద్రమహంకాళీ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరుపుతున్నాం. అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కమిటీని నియమించాం. జాతర ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నీ ఏర్పాట్లు చేశాం. – గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే, పాతర్లపల్లి



ఆకర్షణీయంగా జెయింట్ వీల్

శిశువిద్యా మందిర్ ఉన్నతికి కృషి



సరస్వతీ శిశుమందిర్ వార్షిక ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న సుభాష్ చంద్ర జమాదార్, ఎమ్మెల్యే రూపేష్

- పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: సరస్వతీ శిశు విద్యామందిర్‌లో చదువును అభ్యసించి అనేక ఉన్నత పదవులు వరించి రాష్ట్ర కీర్తిని పెంచుతున్న విద్యాలయం ఉన్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్ 35వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వాగత ఉపన్యాసం విద్యాలయం ప్రధాన అచార్యులు సరోజ్ పండా చేశారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామీ వివేకానంద చిత్రపటానికి మహాంత రామానంద్ దాస్‌జీ జ్యోతి నివాళులర్పించారు. గౌరవ అతిథిగా జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, ముఖ్యవక్తగా సంస్కృత మహావిద్యాలయం రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణా దేవి హాజర్యయ్యారని సుభాష్ చంద్ర జమాదార్‌లు తెలిపారు. చంద్రగిరి టిబెటియన్ శరణార్థుల శిబిరం మేనేజర్ కెంపోంజీ కూడా పాల్గొన్నారు. ఈ విద్యాలయంలో ప్రస్తుతం 750 మంది విద్యార్థులు ఒడియా మీడియంలో విద్యను అభ్యసిస్తున్నారని పాఠశాల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర పట్నాయక్ పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణులయ్యారని, 10 మంది రాష్ట్రస్థాయిలో జరిగిన టెస్ట్ బోర్డు పరీక్షల్లో 92 శాతం మార్కులు సాధించారన్నారు. ఈ విద్యాలయం కృషికి అనేక మంది అండగా ఉంటున్నారన్నారు. అనంతరం పలు క్రీడాంశాల్లో పాల్గొని విజేతలైన విద్యార్థులకు ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, ఎస్పీ పండా చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. అనంతరం సరస్వతీ శిశు మందిర్ బాలబాలికలు సంప్రదాయ నృత్యాలతో అలరించారు.



సరస్వతీ శిశు విద్యామందిర్ వార్షిక ఉత్సవానికి విచ్చేసిన అతిథులు, విద్యార్థులు

• మేలుకొలుపు



గొల్లవీధిలో మేలుకొలుపు బృందం

పర్లాకిమిడి: ధనుర్మాసం సందర్భంగా 15వ వార్డు గొల్లవీధి త్రినాథ కమిటీ సభ్యులు ఆదివారరం తెల్లవారు జామున మేలుకొలుపులో పాల్గొని దేవుని పాటలు పాడారు. మార్గమధ్యలో వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఈ మేలుకొలుపు భోగి పండగతో ముగుస్తుంది. 60 ఏళ్లగా పర్లాకిమిడిలో ధనుర్మాసంలో ఈ మేలుకొలుపు సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు కమిటీ సభ్యుడు అప్పారావు తెలియజేశారు. ద్వాదశి రోజు ఖంజా వీధిలో ఉన్న త్రినాథ మందిరం వద్ద అన్నసంతర్పణ చేస్తామన్నారు.

23 కిలోల గంజాయి స్వాధీనం

- మహిళ అరెస్టు



అరెస్టయిన మహిళ



స్వాధీనం చేసుకున్న గంజాయి

రాయగడ: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న మహిళను అబ్కారీ శాఖ అధికారులు ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి 23.350 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అబ్కారీ శాఖ ఎస్‌ఐ సంజయ్ ప్రధాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం ఎప్పటిలాగే రైల్వే స్టేసన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన మహిళ బ్యాగులను పరిశీలించగా గంజాయి పట్టుబడిందన్నారు. దీని విలువ సుమారు 2.30 లక్షల రూపాయలు ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన మహిళ మధ్యప్రదేశ్ రాష్ట్రం కిరంపుర్ ప్రాంతంలోని సుమిత్ర ఆదివాసీగా గుర్తించారు. ఆమెను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు పేర్కొన్నారు.

7,400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో పట్టుబడిన వంట సారా

- 1,140 లీటర్ల ఐడీ లిక్కర్ స్వాధీనం

పర్లాకిమిడి: సంక్రాంతి సందర్భంగా ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా, ఒడిశా రాష్ట్రాల అధికారులు సంయుక్తంగా కాశీనగర్, గుసాని సరిహద్దుల్లో సారా తయారీపై దాడులు ఆకస్మికంగా జరిపారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి తిరుపతి నాయుడు, అబ్కారీశాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్, డి.వి.జి.రాజు (ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్), ఒడిశా (గజపతి జిల్లా) డిప్యూటీ సూపరింటెండెంట్ బిభూతి భూషన్ ద్వారీ ఆధ్వర్యంలో ఏటబిలో సంయుక్తంగా అబ్కారీశాఖ సారా దాడులు చేశారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో సింగుపుర్, శిరడ, గురిసింగి గుడ, తమ్మిలిగుడ, ఒడిశాలో నేరడిగుడ ప్రాంతాల్లో సారా వంటలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 7,400 లీటర్ల బెల్లం ఊట, 1140 లీటర్ల ఐడీ లిక్కర్ పట్టుకుని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్స్, శ్రీకాకుళం, పలాస, పాతపట్నం, కొత్తూరు, ఆమదాలవలస, నరసన్నపేట అబ్కారీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర క్విజ్ పోటీల విజేత నెల్లిమర్ల

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఉత్తరాంధ్ర క్విజ్ పోటీల్లో విజయనగరం జిల్లా నెల్లిమర్ల జట్టు విజేతగా నిలిచింది. తొలుత ఈ పోటీలను ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రారంభించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో స్థానిక వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. నెల్లిమర్ల జట్టు ప్రథమ, పూండి జట్టు ద్వితీయ, మందస మండలం భేతాళపురం జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. మొత్తం 70 జట్లు హాజరుకాగా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి టాప్ 10 జట్లు ఎంపిక చేసి నిర్వహించారు. విజేత జట్లకు సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్‌ను లారీ ఢీ కొట్టి ఒకరికి గాయాలు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై పణుకుపేట-కాశీపేట గ్రామాల మధ్య ఆదివారం మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఒకర వ్యక్తి గాయాల పాలయ్యాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన పల్లిగుల్ల సీతారాం స్వగ్రామం నుంచి సీతానగరం వస్తున్నాడు. అదేసమయంలో పార్వతీపురం నుంచి బొబ్బిలి వెళ్తున్న లారీ మోటార్ సైకిల్‌లో వెళ్తున్న సీతారాంను పణుకుపేట జంక్షన్ సమీపంలో ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం వచ్చి చికిత్స నిమిత్తం బొబ్బిలి కమ్యూనిటీ ఆస్పత్రికి సీతారాంను తరలించింది. బాధితుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

గంట్యాడ: మండలంలోని కొర్లాం జంక్షన్ దగ్గర ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి గాయాల పాలయ్యాడు. మండలంలోని అద్దతీగ గ్రామానికి చెందిన లేగల అప్పారావు, అతని భార్య లక్ష్మి శనివారం విజయనగరం వెళ్లి బైక్ పై విజయనగరం నుంచి రాత్రి 9 గంటల సమయంలో తిరిగి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో అప్పారావుకు గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని స్థానికులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

పాలకొండ: మండలంలోని జి.వెంకటాపురంలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై ప్రయోగమూర్తి పోలీసు సిబ్బందితో ఆదివారం దాడులు చేశారు. పోలీసులు వస్తున్నట్లు సమాచారం తెలియడంతో చాలా మంది పరారవగా 8 మంది పట్టుబడినట్లు ఎస్సై చెప్పారు. పట్టుబడిన వారి దగ్గర నుంచి రూ.1,06,930లను,ఆరు మొబైల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జి.వెంకటాపురంలో..

పాలకొండ రూరల్: మండలంలోని జి.వెంకటాపురం సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో 8 మంది జూదరుల నుంచి రూ.1,06,950 నగదుతో పాటు 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.ప్రయోగమూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


దేముడమ్మ మృతదేహం

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట గ్రామానికి చెందిన మిరియాల దేముడమ్మ(69) అనే మహిళ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు వల్లంపూడి ఎస్సై బి.దేవి చెప్పారు. దేముడమ్మ ఈనెల 6వ తేదీన ఉదయం చలికి కుంపటి కాగుతుండగా చీరను నిప్పంటుకుని గాయాల పాలైంది. దీంతో ఆమెను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న దేముడమ్మ మృతి చెందినట్లు ఆమె కుమార్తె గుమ్మాల వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై దేవి చెప్పారు.

కూలిన రైవాడ కల్వర్టు


వేపాడ: బల్లంకి - ఆనందపురం రహదారిలో కూలిన కల్వర్టు

వేపాడ: మండలంలోని బల్లంకి నుంచి ఆనందపురం వెళ్లే రహదారిలో రైవాడ కాలువపై దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు ఆదివారం కూలిపోయింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం కల్వర్టు పైనుంచి ఓ ట్రాక్టర్ వెళ్లగానే అది కూలిపోయింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కల్వర్టు శిథిలావస్థకు చేరుకుందని గ్రామస్తులు, ప్రయాణికులు పత్రికాముఖంగా పలుమార్లు తెలియజేసినప్పటికీ సంబంధిత జీవీఎంసీ అధికారులు పట్టించుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కల్వర్టు కూలిపోవడంతో బానాది, బల్లంకి, ఆనందపురం రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. దీంతో ఆయా గ్రామస్తులు వేపాడ మీదుగా ఆనందపురం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమాచారం అందడంతో పంచాయతీ కార్యదర్శి మూర్తి, వల్లంపూడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. ఈ నెల 26,27,28 తేదీల్లో బల్లంకి గ్రామదేవత తీర్థమహోత్సవానికి లక్షలాదిమంది భక్తులు హాజరవుతాయని అప్పటిలోగా కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంక్రాంతి సందడిలేని పల్లెలు

- కానరాని గంగిరెద్దులు, హరిదాసుల సందడి

పార్వతీపురం: రంగురంగుల హరివిల్లులతో తీర్చిదిద్దిన లోగిళ్లు, పసుపు కుంకుములతో వేసిన గొబ్బెమ్మలు, భోగిమంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలు, పిండివంటల ఘుమఘుమలు ఎటు చూసినా కొత్త అల్లుళ్లు, సంక్రాంతి వచ్చిందంటేనే పల్లెల్లో ఆ సందడే వేరు. నేడు పాశ్చాత్య ధోరణి వెంట పాకులాడుతున్న మన సంస్కృతి , సంప్రదాయాలను యువత మరిచిపోతోంది. నేటి తరం గంగిరెద్దులు, హరిదాసులు అంటే ఏంటి? అని అడిగే పరిస్థితికి మనం వచ్చామంటే మన పరిస్థితి ఎలా ఉందో గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంక్రాంతి వచ్చిందంటే చాలు పల్లెల్లో 10రోజుల ముందునుంచే గంగిరెద్దుల నాట్యాలు, హరిదాసుల సంకీర్తనలు, ఇళ్ల ముంగిట రంగవల్లులు, వాటి మధ్య గొబ్బెమ్మలు వెరసి ప్రతి ఇంటి ముందు సంబరం వెల్లివిరిసేది. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాలకు వచ్చి అందరూ ఒక చోటకు చేరి ఆనందంగా గడిపేవారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులతో హడావిడి జీవనంలో సంస్కృతి, సంప్రదాయాలు ఆదరణ కోల్పోతున్నాయి.

కానరాని సంబరాలు..

సంక్రాంతి సమీపిస్తున్నప్పటికీ పల్లెల్లో గంగిరెద్దులు కనిపించడం లేదు. హరిదాసుల కీర్తనలు వినిపించడం లేదు. ప్రస్తుత కాలంలో వారికి ఆదరణ లేకపోవడం ఒక కారణమైతే, ఆయా జాతుల వారు కుల వృత్తులను మానుకోవడం మరో కారణంగా చెప్పవచ్చు. ఈ కారణంగా సంక్రాంతి సందర్భంగా పల్లెల్లో కన్పించాల్సిన సంతోషాలు, బంధువుల మధ్య ఆప్యాయతలు కూడా దూరమవుతున్నాయి. ప్రస్తుతం అందరూ సెల్‌ఫోన్లలో కబుర్లు, ఇంటర్‌నెట్, వాట్సాప్, చాటింగ్‌లకే పరిమితమవుతున్నారు. సంక్రాంతి మూడు రోజులు మాత్రం నామమాత్రంగా వేడుకలను చేసుకుని మమ అనిపించేస్తున్నారు. మొదటి రోజు భోగి మంటలు వేసి నవధాన్యాలు, రేగుపండ్లతో స్నానం చేస్తారు. నువ్వులు, పెసలు కలిపిన పులగన్నం చేసుకుని తింటారు. సంక్రాంతి నాడు దేవుడికి నైవేద్యం పెట్టి పితృదేవతలకు స్వయంపాకాలు, కొత్తబట్టలు చూపించి మొక్కులు చెల్లిస్తారు. కనుమరోజున పశువులను అందంగా అలంకరించి పూజలు చేస్తారు.


సంగంవలసలో హరిదాసుల కీర్తనలు


ములగలో ఇంటిముందు గంగిరెద్దుల సందడి

కనుమరుగవుతున్న హడావిడి

రెండు దశాబ్దాల క్రితం వరకు సంక్రాంతి వచ్చిందంటే పదిరోజుల ముందునుంచే గ్రామాల్లో బంధుమిత్రులతో హడావిడిగా ఉండేది. ఎద్దుల కొమ్ములకు రంగులు వేసి అలంకరించేవారు. గంగిరెద్దు వాళ్ల పొగడ్తలు, హరిదాసుల కీర్తనలతో గ్రామమంతా సందడిగా ఉండేది. సంక్రాంతి పండగ అంటే పిండివంటలు, మాంసాహారాలు, కొత్త దుస్తులు వేసుకోవడం తదితరాలు చేసేవారు. కానీ ప్రస్తుతం ఈ సందడి కొన్ని గ్రామాలకే పరిమితమవుతోంది. ఇవన్నీ ఇంటర్ నెట్‌లలో చూసి ఆనందం పడాల్సి వస్తోంది.

తిరుమల పవిత్రతను దెబ్బ తీస్తున్నారు

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఉన్న తిరుమల తిరుపతి పవిత్రతను టీడీపీ కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తుండడం చాలా బాధాకరమని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన పట్టణంలోని తన స్వగృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి తిరుమల పవిత్రతను దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లడ్డూలో కల్తీ నెయ్యి వాడారంటూ ముఖ్యమంత్రి స్థాయిలో చంద్రబాబు అసత్య ఆరోపణల ద్వారా నానారాద్ధాంతంచేశారని దుయ్యబట్టారు. ఇటీవల వైకుంఠ ఏకాదశి టిక్కెట్ల విషయంలో సరైన ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడం వల్ల అమాయక భక్తులు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి నెలకొందని వాపోయారు. దీనిపై ప్రభుత్వం సరిగ్గా స్పందించలేదన్నారు. కాగా వారి అజాగ్రత్త, అశ్రద్ధ కారణంగా ఈ సంఘటన జరిగితే దానిని అంగీకరించేలేక ఆ నిందలను జగన్‌మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలపై నెట్టే ప్రయత్నం చేయడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. గతంలో జగన్‌మోహన్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలు ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో తిరుమలలో చేపట్టే కార్యక్రమాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయించడం వల్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని గుర్తుచేశారు. చంద్రబాబు పాలనలోనే రాష్ట్రంలో ఇటువంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు.

ఐఏఎస్ అధికారికి కలెక్టర్ పరామర్శ


ఐఏఎస్ అధికారి శివశంకర్‌ను పరామర్శిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

శృంగవరపుకోట: తెలంగాణ రాష్ట్ర ఐఏఎస్ అధికారి లోతేటి శివశంకర్‌ను కలెక్టర్ డా.బీఆర్.అంబేద్కర్ ఆదివారం పరామర్శించారు. శివశంకర్ తండ్రి సన్యాసప్పడు ఎస్.కోట మండలంలో ధర్మవరం గ్రామంలో మరణించిన నేపథ్యంలో కలెక్టర్ అంబేడ్కర్ ధర్మవరం వచ్చి ఐఏఎస్ శివశంకర్ ఇంటికి వెళ్లి వారి తండ్రి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. గతంలో లోతేటి శివశంకర్ ఆంధ్రరాష్ట్రంలో పల్నాడు, కడప జిల్లాల కలెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశ్రీ సీఈఓగా పనిచేస్తున్నారు.

మైత్రి మీడియా ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు


రంగవల్లులను పరిశీలిస్తున్న మజ్జి సిరిసహస్ర, అవనాపు విక్రమ్, బ్యాంకాక్ పిల్ల సామంతపూడి శ్రావణిలు

విజయనగరం టౌన్: మైత్రి మీడియా ఆధ్వర్యంలో స్థానిక గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన రంగవల్లుల పోటీలకు మహిళల నుంచి విశేషస్పందన లభించిందని మైత్రి మీడియా యాజమాన్య ప్రతినిధులు మజ్జి సిరిసహస్ర, అవనాపు విక్రమ్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు చాటిచెప్పేందుకు వాటిని భావితరాలు కొనసాగించే దిశగా ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా సంక్రాంతి సంబరాల్లో రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన యూట్యూబ్ చానల్ ద్వారా విశేష ఖ్యాతి గడించిన బ్యాంకాక్ పిల్ల సామంతపూడి శ్రావణి మాట్లాడుతూ మైత్రి మీడియా, జీ తెలుగు సంయుక్త ఆధ్వర్యంలో రంగుల రంగవల్లు పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాయిదుర్గా ప్రసాద్ వయోలిన్ కచేరీ, ఆదెయ్య మాస్టారు కామెడీ ప్రదర్శనలు, ఘంటసాల స్మారక కళాపీఠం ప్రతినిధి ఎం.భీష్మారావు శిష్యబృందం సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో రంగవల్లుల పోటీల్లో ప్రథమ విజేత తెలంగాణలోని ఖమ్మం జిల్లా వాసి ఎం.సత్యవేణికి బంగారు నెక్లెస్, ద్వితీయ బహుమతిగా విజయనగరానికి చెందిన జి.లక్ష్మికి బంగారు చెవిదిద్దులు, మూడోబహుమతి పొందిన దివ్యకు వెండిగిన్నె, 12 మందికి కన్సొలేషన్ బహుమతులు, న్యాయనిర్ణేతలకు, కళాకారులకు సత్కారాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాకర్లపూడి సీతాదేవి, జీ తెలుగు సినిమాల ప్రతినిధి అర్జున్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రోడ్డును బ్లాక్‌చేసిన టీడీపీ కార్యకర్త వాహనం

- గంటసేపు ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు
- పోలీసుల ప్రవేశంతో తీరిన ఇబ్బంది


రోడ్డుపై పార్కింగ్ చేసిన టీడీపీ కార్యకర్త బొలెరో వాహనం


ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

రాజాం: రాజాం పట్టణంలోని పాలకొండ రోడ్డులో టీడీపీ కార్యకర్త అత్యుత్సాహం కారణంగా ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎస్‌వీఎస్ పిక్చర్ ప్యాలెస్ ఎదురుగా ప్రధాన రహదారిపై ఓ టీడీపీ కార్యకర్త బొలెరో వాహనాన్ని ఆదివారం రోడ్డుపై పార్కింగ్ చేసి స్నేహితులను కలిసేందుకు వెళ్లిపోయాడు. దీంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పుకోలేక ట్రాఫిక్ చిక్కులు ఏర్పడ్డాయి. వాహన చోదకుడి గురించి పోలీసులు ఆరా తీసి చివరికి విసిగిపోయారు. గంటసేపు అనంతరం సంబంధిత వాహనదారు అక్కడికి వచ్చి బొలెరో వాహనం తీయడంతో సమస్య సద్దుమణిగింది. వాల్మీకి సేవాదళ్ అనే స్టిక్కర్‌తో వాహనంపై టీడీపీ నేతల ఫ్లెక్సీ ఉంది. తాను టీడీపీ నేతను అని వాహనదారు చెప్పడంతో పోలీసులు ఏమీ అనకుండా విడిచిపెట్టేశారు. సుమారు గంటసేపు ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు టీడీపీ కార్యకర్త తీరును దుయ్యబట్టారు. ఈ తంతుతో కిలోమీటర్ మేర పాలకొండ రోడ్డులో వాహనాలు నిలిచిపోగా ఇద్దరు ఎస్సైలు, నలుగురు కానిస్టేబుళ్లు వచ్చి వాహనాలను క్రమబద్ధీకరించి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.

మిలటరీ ఉద్యోగాలకు పుట్టినిల్లు ముగడ


కోటస్వామి నాయుడు (లెఫ్టినెంట్ కల్నల్)(ఫైల్)


ముగడ గ్రామం

బాడంగి: మండలంలోని ముగడ గ్రామం మిలటరీ ఉద్యోగులకు పుట్టినిల్లుగా చెప్పుకోవచ్చు. ఈ గ్రామం నుంచి సుమారు మూడు దశాబ్దాల క్రితం నుంచి యువకులు మిలటరీ బాట పట్టారు. మొదట బాడంగికి చెందిన స్వర్గీయ కోటస్వామి నాయుడు అప్పట్లో మిలటరీలో చేరి గ్రామంలోని యువతకు ఆదర్శంగా నిలిచి మిలటరీవైపు దృష్టి మళ్లేలా చేశారు. ఆయన లెఫ్టినెంట్ కల్నల్‌గా ఉన్నసమయంలో గ్రామానికి చెందిన పదోతరగతి చదివి ఖాళీగా ఉన్న వారిని మిలటరీలో, ఉద్యోగాలకు అవకాశాలు కల్పించి సుమారు 50మందివరకు ఆ దారిలో పయనించే విధంగా స్ఫూర్తి కలిగించారు. గ్రామంలో ఆయన బావ, టీచర్ యామల స్వామి నాయుడు ప్రోత్సాహంతో గ్రామస్తులు తమ పిల్లలను మిలటరీ వైపు పంపించేందుకు సుముఖత చూపడంతో ఆగ్రామం మిలటరీ గ్రామంగా పేరు తెచ్చుకుంది. చుట్టుపక్కల వారికి కాస్తంత ధైర్యాన్ని నింపింది. అదే గ్రామానికిచెందిన రిటైరైన చప్పసూర్యనారాయణ మిలటరీలో వైద్యుడిగా కొనసాగి గ్రామస్తులకు స్ఫూర్తిగా నిలిచారు. గ్రామంలో స్వచ్ఛంద గ్రంథాలయాన్ని స్థాపించి గ్రామంలోని నిరుద్యోగ యువత, పెద్దలకు విజ్ఞానాన్ని పంచిపెడుతున్నారు. పండగలకు గ్రామానికి వచ్చినప్పుడు ఉచిత వైద్యశిబిరాల ద్వారా గ్రామానికి చెందిన రోగులకు ఉచిత వైద్యం అందించి మంచిపేరు తెచ్చుకున్నారు. అదేవిధంగా సైనికపాఠశాలలో చదివి వైమానికాదళంలో చేరిన మత్స్యమురళీ ధరరావుతో పాటు మరికొందరు గ్రామానికి సేవలందించారు. మొత్తంపై ఆ గ్రామంలో 50 మందికి పైగా మిలటరీ ఉద్యోగాలు చేసి పదవీవిరమణ చేసినవారు కొందరు కాగా ఇప్పటికీ పనిచేస్తున్న వారు మరికొంతమంది ఉన్నారు.

సైనికులకు వైద్యసేవచేయడం అదృష్టం



ఒక పల్లెటూరిలో పుట్టి మిలటరీలో కల్నల్‌గా డాక్టర్ ఉద్యోగం సాధించి సైనికులకు వైద్యసేవలుచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. స్వగ్రామంలో గ్రంథాలయాన్ని కూడా స్థాపించి నిరుద్యోగులకు విజ్ఞానాన్ని అందిస్తున్నందుకు సంతోషంగాఉంది.

చప్ప సూర్యనారాయణ,
మిలటరీ డాక్టర్(లెఫ్టినెంట్)ముగడ

ఆర్మీ ఉద్యోగాలకు ప్రోత్సహించాను



స్వగ్రామంలో ఎంతోమంది నిరుద్యోగ యువతను మిలటరీ ఉద్యోగాల వైపు ప్రోత్సహించడం సంతోషంగా ఉంది. ఆ కుటుంబాల వారు బాగుపడ్డారు. లేమిస్థితి నుంచి ఆర్థికంగా ఎదిగి గ్రామాభివృద్ధికి సహకారం అందించారు. ఈ అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

యామల స్వామినాయుడు,
రిటైర్డ్ టీచర్, ముగడ

కోడిపందాలు, పేకాట శిబిరాలపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ వకుల్ జిందల్


వకుల్ జిందల్, ఎస్పీ, విజయనగరం

విజయనగరం క్రైమ్: జిల్లాలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడిపందాలు, పేకాట, గుండాటలు, ఇతర రకాలైన జూద క్రీడలను నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని కోరారు. గతంలో పేకాట, కోడిపందాలతో ప్రమేయమున్న 109మంది వ్యక్తులను గుర్తించి, వారిని మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేశామన్నారు. హైకోర్టు ఆదేశాలతో మండల స్థాయిలో రెవెన్యూ, స్థానిక పోలీసులు, జంతు సంరక్షణ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. కోడిపందాలు నిర్వహించే వారిపైనా, కోడి కత్తులను తయారుచేసే వారిపైనా, కోడిపుంజులకు కత్తులు కట్టిన వారిపైనా నిఘా పెట్టామని స్పష్టం చేశారు. కోడిపందాలు నిర్వహించే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో డ్రోన్స్‌తో పర్యవేక్షిస్తామని తెలిపారు. పండగలకు స్వంత గ్రామాలకు వెళ్లే ప్రజలు ప్లేస్టోర్ నుంచి ఎల్‌హెచ్ఎంఎస్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, స్థానిక పోలీసులకు సమాచారమిచ్చి సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇళ్లల్లో విలువైన వస్తువులు ఉంచవద్దని, సాధ్యమైనంత వరకూ వాటిని తమతో తీసుకువెళ్లడం, లేదా బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు.

మార్కెట్లు కిటకిట


భోగి పళ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు


రద్దీగా ప్రధాన రహదారి


రద్దీగా షాపింగ్ మాల్


ఆర్డర్‌పై తయారు చేసిన పిండివంటలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండగ సందడి కనిపిస్తోంది. మరో రెండు రోజుల్లో పెద్ద పండగ ప్రారంభం కానున్న నేపథ్యంలో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వస్త్ర, బంగారం, కిరాణా, పిండి వంటల దుకాణాల్లో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. పండగ సమీపిస్తున్న కొద్దీ కొనుగోళ్లు మరింత ఊపందుకుంటాయి.

ఆర్డర్‌పై పిండి వంటలు..

సంక్రాంతి పండగ కోసం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ తదతర ప్రాంతాల్లో ఆర్డర్‌పై పిండి వంటల తయారీ ముమ్మరంగా సాగుతోంది. అరిసెలు, మిఠాయిలు, జంతికెలు, పూతరేకులు వంటి పిండి వంటలు పెద్ద ఎత్తున ఆర్డర్‌పై తయారు చేస్తున్నారు. ఈ వ్యాపారం కూడా బాగా జరుగుతోంది. ఏడాది మొత్తంలో సంక్రాంతి సీజన్‌లో పిండి వంటల తయారీకి డిమాండ్ బాగుంటుంది.

నేడు చదురుగుడికి చేరుకోనున్న పోలమాంబ



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారు సోమవారం గ్రామంలోని చదురుగుడికి చేరుకోనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు ఈఓ వి.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో చేస్తున్నారు. సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో గోముఖి నది ఒడ్డున పూజారి కుటుంబీకులు, రెవిన్యూయుడు, పూడి, కుప్పిలి వారి కుటుంబీకులు, ఆశాధీలు అమ్మవారికి పూజలు జరిపించి, గ్రామంలోని చదురుగుడిలోకి ఆహ్వానిస్తారు. మేళతాళాలు, భాజభజంత్రీలు, తప్పెడుగుళ్లు, యువత కేరింతల మధ్య అమ్మవారి ఘటాలను తీసుకువస్తారు. అమ్మవారి ఘటాలకు భక్తులు ఎదురెళ్లి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహిస్తారు. ఈ నెల 8న శంబర పోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి తీసుకు వచ్చేందుకు చాటింపు వేసిన విషయం తెలిసిందే. సోమవారం అమ్మవారు గ్రామానికి చేరుకుని, మంగళవారం విశ్రాంతి తీసుకుంటారు. బుధవారం నుంచి అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ నెల 27న తొలేళ్ల ఉత్సవం, 28న సిరిమానోత్సవం, 29న అనుపోత్సవం నిర్వహిస్తారు.